క్లుప్తంగా

కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలి



ఈఓపీఆర్డీ గౌరికుమారికి వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కె.గంగవరం: పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి, భారం తగ్గించాలని కోరుతూ సోమవారం ఈఓపీఆర్డీ గౌరికుమారికి మండల పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులకు వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాల వల్ల పని ఒత్తిడి పెరిగి అనారోగ్యాలకు గురవుతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. సెలవు దినాలు, పండగ దినాలు కూడా ఉపయోగించుకోవడానికి ఏ మాత్రం అవకాశం ఉండడం లేదని కనీసం కుటుంబ సభ్యులతో గడపడానికి కూడా ఉండడం లేదని వారు పేర్కొన్నారు. ప్రతిరోజు విధులు నిర్వహిస్తూ వ్యక్తిగతంగా, ఆరోగ్యపరంగా కార్యదర్శులు ఎంతో నష్టపోతున్నారని వెంటనే స్పందించి పని ఒత్తిడి, భారం నుంచి విడుదల కలిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ ద్వారా ప్రభుత్వానికి కార్యదర్శుల పని భారం, ఒత్తిడి గురించి తెలియజేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

దాళ్వా పంట ముసాయిదా జాబితా ప్రచురణ



కె.గంగవరం సేవా కేంద్రం వద్ద ముసాయిదా జాబితా ప్రచురిస్తున్న ఏఓ

కె.గంగవరం: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద సోమవారం దాళ్వా పంటకు సంబంధించి ముసాయిదా జాబితా ప్రచురించామని ఏఓ బలుసు రవి అన్నారు. కె.గంగవరం రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ సేవా కేంద్రాల వద్ద రైతుల ముసాయిదా జాబితా అందుబాటులో ఉందన్నారు. ఈ జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్న రైతులు రాబోయే మూడు రోజుల్లోపు తెలియజేయాలని సూచించారు. తద్వారా మార్పులు చేసి తుది జాబితా ఈ నెల 22న ప్రచురిస్తామన్నారు. దీంతో పాటు రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ కింద విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని ఇప్పటికే మండల వ్యాప్తంగా 60 శాతం మంది రైతులు నమోదు చేయించుకున్నారన్నారు. మిగిలిన వారు కూడా తప్పకుండా రైతు సేవా కేంద్రాల వద్ద విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకుని పొందాలని కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ సంస్థ సభ్యులు

కాజులూరు: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ జోనల్ సూపర్‌వైజర్ గెద్దాడ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గొల్లపాలెం పంచాయతీలో ఎయిడ్స్ వ్యాధిపై చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ పోతురాజు ప్రసన్నమానిక ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో తమ సంస్థ గ్రామాల్లో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి అవసరమై చికిత్స, మందులు ఉచితంగా అందజేస్తుందన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పాలకవర్గ సభ్యులు గ్రామంలో ఏవరైన వ్యాధిగ్రస్తులు ఉన్నట్టు గమనిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రవి, పాలకవర్గ సభ్యులు అంగర శ్రీను, రేఖపల్లి సత్తిబాబు, వెంటపల్లి శ్రీను, తాతారావు సంస్థ సిబ్బంది సీహెచ్ రేణుక పాల్గొన్నారు.

ఆసుపత్రికి సాంకేతిక పరికరాల వితరణ



కపిలేశ్వరపురంలో దాత అందించిన కంప్యూటర్లతో సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన, వైజాగ్‌లో స్థిరపడిన పారిశ్రామికవేత్త గన్నమని శేష మురళీకృష్ణ కపిలేశ్వరపురంలోని సీహెచ్‌సీకి రెండు కంప్యూటర్లు, 12 సీసీ కెమెరాలను సమకూర్చారు. ఆసుపత్రి నిర్వహణలో తరచూ సహకరిస్తున్న మురళీకృష్ణను సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఆసుపత్రి వైద్యాధికారి పి.రాజ్‌కుమార్, ఇతర వైద్యులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కరోనా సమయంలో రూ.లక్షల విలువైన ఆక్సిజన్ ప్లాంట్‌ను మురళీకృష్ణ సమకూర్చారని సర్పంచ్ తెలిపారు.

మూగ జీవాలకు వేసవి ముప్పు

- అగ్ని, విద్యుత్ ప్రమాదాల్లో తరచూ పశువులు మృతి
- పశు సంరక్షణలో నిర్లక్ష్యం వీడాలి
- రెండు నియోజకవర్గాల్లో రెండు అగ్నిమాపక కేంద్రాలు
- వాటి సామర్థ్యం మరింత పెంచాలంటున్న రైతులు



2019 మే 17న వెదురుమూడి పశువులపాక దగ్ధం కావడంతో మంటల్లో కాలి మృత్యువాతపడిన పాడి పశువు

కపిలేశ్వరపురం: ఆహారం నుంచి ఆర్థిక, సామాజిక అంశాలెన్నో పశువుల పెంపకంతో మానవుని జీవితం ముడిపడి ఉంటుంది. పాల ఉత్పత్తి ఆవశ్యకత నేపథ్యంలో పశువుల పెంపకం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. పశువుల ఆరోగ్యంతో పాటు వేసవిలో తరచూ జరిగే అగ్ని, విద్యుత్ ప్రమాదాల నుంచి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వేసవిలో అగ్ని, విద్యుత్ ప్రమాదాల్లో పశువుల పాకలు, గడ్డివామిలు తరచూ దగ్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత వేసవిలో పశువుల సంరక్షణపై రైతులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

అగ్నిమాపక దళాల సామర్థ్యమిలా...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఒక్కో అగ్నిమాపక కేంద్రం చొప్పున రెండు కేంద్రాలున్నాయి. మండపేట కేంద్రం సిబ్బంది మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, ఆలమూరు, తూర్పుగోదావరి జిల్లాలోని కడియం, అనపర్తి మండలాల పరిధిలో 60 గ్రామాల్లో సేవలందిస్తున్నారు. రామచంద్రపురం అగ్నిమాపకదళం సిబ్బంది రామచంద్రపురం పట్టణం, రూరల్ గ్రామాలు, కె.గంగవరం, కరప, బిక్కవోలు, రాయవరం మండలాల్లోని 105 గ్రామాలకు సేవలందిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది. 2024–25లో 53 ప్రమాదాలు చోటుచేసుకోగా అందులో నివాసిత ప్రాంతాలతో పాటు వ్యవసాయ క్షేత్రాల్లో సంభవించినవి ఉన్నాయి. 2023–24లో 41, 2022–23లో 32, 2021–22లో 45 ప్రమాదాలు సంభవించాయి. ఆయా ప్రమాదాల్లో అగ్నిమాపక సిబ్బంది స్పందించి నివాసిత ప్రాంతాల్లో ఆస్తి నష్టాన్ని నివారించగలిగారు.

మానవ తప్పిదాలతో ప్రమాదాలు

వ్యవసాయ క్షేత్రాల్లోనూ, పశువుల మకాంలలో మానవ తప్పిదాల కారణంగా పశువులు ప్రమాదాలకు గురవుతున్నాయి. 2023 ఫిబ్రవరి 1న రాయవరం మండలం చెల్లూరు శివారు సూర్యారావుపేటలో ఒక గేదె చనిపోగా మరో రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. 2023 మార్చి 17న కె.గంగవరం మండలం కుందూరు శివారు కుందూరులంకలో పశువుల పాక దగ్ధం కావడంతో రెండు ఒంగోలు జాతి ఆవులు చనిపోయాయి. ఆ తర్వాత సైతం అనేక ప్రమాదాలు సంభవించాయి. 2020 మే 20న అంగరలో రెండు ఎకరాల ధాన్యపు రాశి, మూడు గడ్డివామిలు దగ్ధమయ్యాయి. 2020 మే 26న కపిలేశ్వరపురం మండలం టేకిలో రెండు పశువుల పాకలు తగలబడటంతో ఆరు పశువులు మృతి చెందాయి. 10 ఎకరాల్లోని గడ్డివామి దగ్ధమైంది. సుమారు రూ.ఐదు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. 2019 మే 16 రాయవరం చెల్లూరులో పశువులపాక దగ్ధమై ఒక పాడి గేదె చనిపోయింది. 2019 మే 17న కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామ శివారు తాళ్లపొలం పుంత ఓఎన్జీసీ వద్ద గ్రామంలో పశువుల పాక దగ్ధమై రెండు గేదె దూడలు మృత్యువాత పడ్డాయి. మరో రెండు పాడి గేదెలకు 50 శాతం గాయాలయ్యాయి. ఒక గేదె స్వల్ప గాయాలతో బయటపడింది. రూ.2.40 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. 2018 మే 5న రాయవరం మండలం వెదురుపాకలో సంభవించిన ప్రమాదంలో 12 ఎకరాల్లోని ధాన్యం రాశులు అగ్నికి ఆహుతయ్యాయి.

అగ్నిమాపక దళ సిబ్బందికి ఇబ్బందులు

వ్యవసాయ క్షేత్రంలో మంటలను ఆర్పడం అగ్నిమాపక దళ సిబ్బందికి ఎంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. విశాలమైన వ్యవసాయ క్షేత్రంలో నిప్పు రాజుకోగానే క్షణాల్లో ప్రమాద తీవ్రత పెరిగిపోతుంది. ప్రమాద ఘటనా స్థలం వ్యవసాయ క్షేత్రం కావడంతో వాహనం నుంచి దూరంగా నీళ్లను చల్లడం సమస్యతో కూడుకున్నది. ఒకే సమయంలో రెండు చోట్ల ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బందికి ఏం చేయాలో పాలుపోని పరిస్థితి తలెత్తుతోంది.

‘యువత పోరు’ను విజయవంతం చేయాలి



అబ్బిరెడ్డి వీర్రాజు

మండపేట: రాష్ట్రంలో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై విద్యార్థి లోకానికి బాసటగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువత పోరు కార్యక్రమం తలపెట్టారని ఆ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బిరెడ్డి వీర్రాజు తెలిపారు. ఈ మేరకు మార్చి 12న తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులంతా తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో విద్యార్థులంతా బుధవారం అమలాపురం బయలుదేరడానికి సమాయత్త మవ్వాలన్నారు. కలెక్టరు కార్యాలయం ఎదురుగా ఆందోళన చేపట్టి వినతిపత్రం అందిస్తామన్నారు. ఎన్నికల హామీలైన నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు వెంటనే అమలు చేయాలని కోరుతూ గళం విప్పాలన్నారు. నిరుద్యోగ యువత, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీర్రాజు విజ్ఞప్తి చేశారు.

అంగరలో వైభవంగా రథోత్సవం



అంగరలో వేణుగోపాలస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీరుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల వీధుల మీదుగా రథంలో దేవతామూర్తులను ఊరేగించారు. ఇరు గ్రామాల భక్తులు రథాన్ని భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగుతూ స్వామిని కీర్తిస్తూ నినదించారు. అంగరలోని పోలేరమ్మ ఆలయం వరకూ రథయాత్ర సాగింది. అక్కడ నిర్వహించిన తీర్థ ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు, ప్రసన్నకుమార్ భార్గవ్, సంపర లక్ష్మీ నరసింహ భాస్కర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిత్య హోమం, నీరాజన మంత్రపుష్పం పూజలు చేశారు. మంగళవారం విశేషార్చన, 12న సదస్యం, పండితాశీర్వచనం పూజలు చేయనున్నట్టు ఆలయ ఈఓ ఎం.రాంబాబురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు, సామాజిక, రాజకీయ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



ద్రాక్షారామలో అఖండ భగవన్నామ సంకీర్తన ముగింపు శోభాయాత్ర

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ హిందూ ధర్మ ప్రచార కర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అఖండ భగవన్నామ సంకీర్తన (సప్తాహం) కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచీ రోజుకు 2 గంటల చొప్పున 12 బృందాలు వారంలో 84 బృందాలు పాల్గొని తమ భక్తి గీతాలతో అలరించారు. సప్తాహం ముగింపు సందర్భంగా సోమవారం ఆలయం వద్ద నుంచి ద్రాక్షారామ, వెలంపాలెం ప్రాధాన రహదారుల్లో భజన బృందాలు, మహిళా కోలాటం బృందాలతో కలసి శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో పాల్గొన్న వారికి ద్రాక్షారామకు చెందిన కొమ్మిశెట్టి భవన్ అధినేతలు కొమ్మిశెట్టి సుబ్బారావు, విశ్వనాథ్ గుప్తా అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రాచీన తెలుగు జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ (సతార్ స్వామి), గరగ బాబూరావు, ఏలూరి మణికంత, ఏడునూతుల మురళి, మేడిశెట్టి సత్యనారాయణ, నీలం పట్టాభి, ముద్రగడ సత్యమూర్తి, కటారపు సత్యనారాయణ, నాగు తదితరులు సప్తాహం నిర్వహణలో సహాయ సహకారాలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: అమలు సాధ్యం కాని హామీలైన సూపర్ సిక్స్ పథకాలను మేనిఫెస్టోలో ప్రకటించి ఏడాది గడుస్తున్న అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. ఈనెల 12న జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గాంధీపేటలోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికార దాహంతో కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలను ప్రకటించి అధికారం వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రజలను ఈ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. గత 9 నెలలుగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవటంతో ఇబ్బందులకు గురవుతున్నారని సూర్యప్రకాశ్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులకు అండగా నిలుస్తూ ఈనెల 12న జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున అమలాపురానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. అనంతరం యువత పోరు పోస్టర్‌ను సూర్యప్రకాశ్ పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, మాతా భారతి, వైస్ ఎంపీపీ శాఖా బాబి, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షులు రాలు యల్లమిల్లి సతీష్ కుమారి, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు పెమ్మిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు వడ్డీతో కలిపి చెల్లించాల్సిందే

కమిషనర్ రంగారావు హెచ్చరిక



వార్డులో శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, కమిషనర్ రంగారావు

మండపేట: పట్టణంలో ఆయా ఆస్తులకు సంబంధించి చెల్లించాల్సిన పన్ను బకాయిదారులు వడ్డీతో సహా చెల్లించాల్సిందేనని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. పట్టణంలో కొంతమంది ఆస్తి పన్ను విషయంలో జాప్యం చేస్తూ వడ్డీ మాఫీ ఉంటుందని అనుకుంటున్నారని, అటువంటి రాయితీలు లేవని ఆయన స్పష్టం చేశారు. పన్నుల చెల్లింపులో నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చెల్లించాలని ఆయన అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి స్వచ్ఛ మండపేట లక్ష్య సాధన కోసం కమిషనర్ రంగారావు ఇతర అధికారులను వెంటబెట్టుకుని 24వ వార్డు సంఘం పుంతరోడ్డు, సైదిల్‌పేటలోని పలు వీధుల్లో పర్యటించారు. ప్రతి ఇంటినీ సందర్శించి స్థానిక మహిళలకు వ్యక్తిగత, పరిసరా పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. డ్రెయిన్లను కేవలం వాడకం నీరు పారడానికి మాత్రమే వినియోగించాలని, అందులో చెత్తా చెదారాలు వేయరాదన్నారు. ఇళ్ల వ్యర్థాలను తడి.పొడి చెత్తగా విడదీసి డస్ట్‌బిన్ల ద్వారా పారిశుధ్య కార్మికులకు అప్పగించాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ పన్ను వసూళ్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాల సభ్యులు వార్డులకు వస్తున్నారని తెలిపారు. పన్నులు వారికి చెల్లించి రశీదు పొందాలన్నారు. పన్నుల చెల్లింపులో కాలయాపన చేస్తే ఆస్తుల జప్తుకు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బుక్కావీధి, బోడావారి వీధి, కంచరవీధి, వల్లూరివారి, నాళంవారి వీధులతో పాటు బురుగుంట చెరువు ప్రాంతాల్లో కుళాయి పన్నులు చెల్లించని వారి ఇళ్లకు కనెక్షన్లను తీసివేశారు. చైర్‌పర్సన్ వెంట 24వ వార్డు కౌన్సిలర్ జొన్నపల్లి విజయలక్ష్మి, నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, కడియాల వెంకటలక్ష్మి, డీఈ కే శ్రీనివాస్, ఆర్వో జేవీఎస్ శాస్త్రి, ఏఈలు పవన్‌కుమార్, ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, టీపీవో కే రమ్య, మెప్మా సీఎంఎం సుజాత, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి

మండపేట: అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన జ్యోతీరావుపూలే, సావిత్రిబాయి పూలే దంపతులకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించాలని జాతీయ బీసీ సంఘం నాయకులు కోన సత్యనారాయణ, పెంకే గంగాధర్, వీరమల్లు శ్రీనివాస్, విన్నకోట రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని జాతీయ బీసీ సంఘం నాయకులు సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న ఉషా టవర్స్ వద్ద జాతీయ క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోన సత్యనారాయణ సారథ్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెద్ద కాలువ వంతెన వద్ద జ్యోతీరావుపూలే విగ్రహానికి, సావిత్రిబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ పూలే దంపతుల ఆశయాలు ప్రపంచానికి ఆదర్శమన్నారు. సావిత్రిబాయి తన భర్త ఆశయాలకు అనుగుణంగా స్త్రీ జనోద్ధరణకు, మహిళలకు విద్యనందించేందుకు పాటుపడ్డారని అన్నారు. భారతరత్నతో పాటు సావిత్రిబాయి జయంతి రోజును మహిళా దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తీగిరెడ్డి మహేష్, పంపన శ్రీనువాస్, మండల ప్రధాన కార్యదర్శి ఒంపోలు పోలరాజు, సందక వీరవెంకట సత్యనారాయణ, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.



సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు



ద్రాక్షారామలో సావిత్రీబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

సావిత్రీబాయి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

కాజులూరు: సావిత్రీబాయి ఆశయాలను నేటి తరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని గొల్లపాలెం గ్రామ ఉప సర్పంచ్, స్థానిక అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి పురస్కరించుకుని సోమవారం గ్రామంలో అలయన్స్ క్లబ్ సభ్యులు సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు బయటకు రావాలంటే ఎన్నో ఆంక్షలు ఉండే ఆ రోజుల్లో సావిత్రీబాయిపూలే మహిళా పాఠశాలను స్థాపించి ఎందరో బాలికలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు మేడిశెట్టి శ్రీరాములు, స్థానిక నాయకులు సువ్వారి గోవిందు, పితాని సుబ్రహ్మణ్యం, కడలి రాంపండు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సావిత్రీబాయికి భారతరత్న ఇవ్వాలి

రామచంద్రపురం రూరల్: దేశంలో స్త్రీ విద్యకు పునాది వేసిన భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలేకు భారతరత్న ప్రకటించాలని మైనార్టీ బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ద్రాక్షారామలోని జ్యోతీరావ్ పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాల వద్ద బీసీ నాయకులతో కలసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గారోజు సూరిబాబు, కొల్లపు కామేశ్వరరావు, పడిదడకల భీమశంకరం, వేమవరపు రాంబాబు, గంపల సోమరాజు, సిద్ధూ, మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రజక చైతన్య సేవా సంస్థ ఆధ్వర్యంలో..

రామచంద్రపురం పట్టణంలో రజక చైతన్య సేవా సంస్థ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఘనంగా నివాళులర్పించారు. సంస్థ నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి వెంకటరమణ మాట్లాడుతూ దేశంలో బహుజనుల కోసం ముఖ్యంగా మహిళల కోసం మొట్టమొదటిగా 1848లో పాఠశాలను నెలకొల్పిన మహోన్నత వ్యక్తి సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. ఆమె జ్ఞాపకార్థం 1997లో భారత ప్రభుత్వం తపాలా బిళ్లను ఆవిష్కరించిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ రజక కమిటీ సభ్యులు కేశనకుర్తి వెంకటేశ్వరరావు, పాలకొల్లు సత్యనారాయణ, కాకినాడ వెంకటరమణ, సూదికొండ రాముడు పాల్గొన్నారు.

మానవ మనుగడకు జీవనాధారం మొక్కలే



చైర్‌పర్సన్ దుర్గారాణిని సత్కరించిన విద్యార్థులు

మండపేట: నేడు మనం నాటిన మొక్కలే రేపు వృక్షాలై మానవ మనుగడకు జీవనాధారమవుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఆమె అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. పచ్చనిచెట్లు పర్యావరణ సమతుల్యతను పెంచి సకల ప్రాణులకు ప్రాణవాయువును, పక్షులకు, పశుపక్ష్యాదులకు నీడనిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. నాక్‌లో బీ గ్రేడ్ సాధించి కాలేజీని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం చైర్‌పర్సన్‌ను అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించి మొక్కను బహూకరించారు. కార్యక్రమంలో రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు అనూష, కాకినాడ రేడియో 90.8 ఎఫ్‌ఎం డైరెక్టర్ సత్య, విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ



నైపుణ్య శిక్షణ ఉపయోగాలను వివరిస్తున్న మెప్మా సీఎంఎం సుజాత

మండపేట: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నైపుణ్య శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్టు మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, ఆశ కో–ఆర్డినేటర్ సత్య పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం మెప్మా విభాగం, ఆశ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తయిన విద్యార్థినులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన అభ్యర్థులకు నైపుణ్య శిక్షణనిచ్చి, ఆశ సొసైటీతో కలిసి ఎస్‌హెచ్‌జీ కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక వారికి ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీవోలు వీరలక్ష్మి, మహాలక్ష్మి, విజయ్, పట్టభద్రులైన విద్యార్థులు పాల్గొన్నారు.

వల్లూరులో అగస్త్యేశ్వరస్వామికి గ్రామోత్సవం

కపిలేశ్వరపురం: వల్లూరులో సోమవారం శ్రీపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామిని అర్చకులు విశేషంగా అలంకరించారు. గ్రామ వీధుల్లో దేవతామూర్తులను ఊరేగించారు. గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

వెల్లలో దేవతామూర్తులకు కల్యాణ వేడుక

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్లలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి, రుక్మిణీ–సత్యభామా సమేత వేణుగోపాల స్వామి, శ్రీదేవీ–భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి వార్ల కల్యాణ వేడుక సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీఎస్ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు చక్రవర్తుల వేణుగోపాలాచార్యుల బ్రహ్మత్వంలో జరిగిన స్వామి వార్ల కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, గ్రామ ఎంపీటీసీ మంచెం దేవి, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విలేకరినంటూ హల్‌చల్ చేస్తున్న వ్యక్తిపై కేసు

రామచంద్రపురం రూరల్: ఫలానా పత్రికలో విలేకరినంటూ, ఫలానా టీవీ చానల్‌లో విలేకరి నంటూ రామచంద్రపురం నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాలుగా హల్‌చల్ చేస్తున్న వ్యక్తిపై ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. రచ్చా వీరరాఘవులు గత కొన్నేళ్లుగా ఏదో ఒక పత్రిక, టీవీ చానల్ పేరు వాడుకుంటూ దానిలో తాను విలేకరినని తనకు డబ్బులు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులు, రేషన్ డీలర్లు, పలు వ్యాపార సంస్థల యజమానులను బెదిరిస్తున్నాడు. ఆదివారం ద్రాక్షారామలోని ఇండేన్ గ్యాస్ సంస్థ సూపర్‌వైజర్ వద్దకు వెళ్లిన వీరరాఘవులు అతని యజమాని ఫోన్ నంబర్ కావాలని అడిగి సంస్థ యజమానికి ఫోన్ చేసి ఒక ప్రముఖ పత్రిక విలేకరినని చెప్పి డబ్బులు డిమాండ్ చేశారు. అతడు బెదిరింపు ధోరణితో మాట్లాడటంతో ద్రాక్షారామ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఎస్సై లక్ష్మణ్ ఇండేన్ సూపర్‌వైజర్ రాజేంద్ర ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ కనబర్చాలి

కపిలేశ్వరపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య రక్షణపై వారి సహాయకులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 21 మంది గర్భిణులను పరీక్షించారు. ఉచితంగా మందులను అందజేశారు. నలుగురుకి మెరుగైన వైద్య పరీక్షలకు అవసరమని గుర్తించారు.